క్లుప్తంగా

ఉచిత కంటి వైద్య శిబిరం



పాతకొట్టాంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ వరహాలు

కోటనందూరు: మండలంలోని పాతకొట్టాంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని పద్మశాలి వీధిలో రామాలయం వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పాయకరావుపేట హైమా నేత్ర వైద్యాలయం డాక్టర్లు రోగులకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు చేసి ఆపరేషన్లకు 30 మందిని గుర్తించారు. వచ్చే ఆదివారం వీరందరికీ ఉచితంగా క్యాటరాక్టు ఆపరేషన్లు చేస్తామని వైద్య సిబ్బంది తెలిపారు. కంటి సమస్యలు ఉన్నవారికి గ్రామ సర్పంచ్ పసగడుగుల వరహాలు మందులు పంపిణీ చేశారు. నేత్రాలయ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిధుల విడుదలపై బీజేపీ శ్రేణుల హర్షం

ఏలేశ్వరం: కేంద్ర ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయంగా నిధులు విడుదల చేయడంతో పట్టణంలో బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. కేంద్రం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో భాగంగా గురువారం రూ.2 వేలు రైతుల బ్యాంక్ ఖాతాల్లో వేసింది. ఈ సందర్భంగా బీజేపీ పట్టణాధ్యక్షుడు గట్టెం వెంకటరమణ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. రాజస్థాన్‌లోని షికార్ జిల్లాలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ 14వ విడత కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో సొమ్ములను విడుదల చేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఏనుగు ధర్మరాజు, దాకే కృష్ణారావు, రెడ్డి లోవరాజు, రాతికింది కృష్ణారావు, గొల్లపల్లి సత్యనారాయణ, గునిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హోమియో మందుల పంపిణీ

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య విద్యాసంస్థల సిబ్బందికి గురువారం ఉచితంగా హోమియో మందులు పంపిణీ చేశారు. క్యాంపస్‌లో సిబ్బంది, విద్యార్థులకు కళ్ల కలక రాకుండా శారదా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ముందు జాగ్రత్తగా హోమియో మందులు పంపిణీ చేసినట్టు సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్ తెలిపారు. కళ్ల కలక ఒకరి నుంచి ఒకరికి చాలా తొందరగా వ్యాపిస్తుందని, వ్యాధిసోకిన వారు కంటిని చల్లని నీటితో శుభ్రపరచి మెత్తని వస్త్రంతో తుడవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి సభ్యులు పెనుమల్లు సత్యనారాయణ రెడ్డి, గిరి ప్రసాద్, జి.ప్రకాశరావు, బొడ్డు చిట్టిబాబు, జి.వెంకటేష్, టి.శ్రీనివాస్, ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

లోవదేవస్థానం చైర్మన్‌కు ఎంపీపీ పరామర్శ

కోటనందూరు: అనారోగ్యంతో బాధపడుతున్న లోవదేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడును ఎంపీపీ లగుడు శ్రీనివాసు గురువారం పరామర్శించారు. జగన్నాథపురంలో అచ్చియ్యనాయుడి స్వగృహానికి ఎంపీపీ శ్రీనివాసు వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తగినంత విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. అనంతరం పిత్యవియోగంతో బాధపడుతున్న పంచాయతీ వార్డు మెంబర్ మామిడి కృష్ణను అతని స్వగృహంలో పరామర్శించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గొర్లి రామచంద్రరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గర్సింగు దొరబాబు, కొరుప్రోలు కృష్ణ, రుత్తల జోగిరాజు, కురసా మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో కేంద్ర బృందం తనిఖీలు



తేటగుంట పీహెచ్‌సీలో తనిఖీలు చేస్తున్న ఎన్‌హెచ్ఎస్ఆర్‌సీ బృందం

తుని రూరల్: తేటగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వసతులు, వైద్య సేవలపై జాతీయ నాణ్యత ప్రమాణాల ధృవీకరణ (ఎన్‌హెచ్ఎస్ఆర్‌సీ) బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. డాక్టర్ వీఎస్ సరస్వతీ ఆధ్వర్యంలో ఇద్దరు సభ్యుల బృందం బుధ, గురువారాలు ఆస్పత్రిలో ఓపీ, మందులు, వైద్యసేవలు తదితర 19 విభాగాలను సమగ్రంగా పరిశీలించింది. రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో సేవలపై ఆరా తీసింది. పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ అన్వేషి ఆధ్వర్యంలో సిబ్బంది అందిస్తున్న సేవలపై బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. ఆస్పత్రిలో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలతో పాటు మౌలిక వసతులు, అందుబాటులో సిబ్బంది, మందులు, పారిశుధ్య నిర్వహణ తదితరాలను తనిఖీల్లో పరిగణనలోకి తీసుకున్నట్టు బృందం సభ్యులు డాక్టర్ సరస్వతీ, డాక్టర్ మృణాళిని యాదవ్ తెలిపారు.

నేడు మండల సమావేశం

గోకవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సాధారణ సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.పద్మజ్యోతి గురువారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపీపీ సుంకర శ్రీవల్లి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

సమస్యల పరిష్కారానికే సురక్ష

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- గ్రామాల్లో జోరుగా జగనన్న సురక్ష కార్యక్రమం



మామిడాడలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

జగ్గంపేట: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని మామిడాడలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే చంటిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు పలు రకాల సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. జగనన్న సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం, ఏఎంసీ చైర్మన్ జనపరెడ్డి బాబు, ఎంపీపీ అత్తులూరి నాగబాబు, వివిధశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

తుని రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ పి.రవికుమార్ సూచించారు. మండలంలోని ఎస్ఎస్‌వీ నగరంలో గురువారం సర్పంచ్ శ్రీరామ్ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులకు అధికారులు ధృవపత్రాలు అందజేశారు. ఎంపీటీసీ సభ్యుడు శెట్టి శ్రీనివాసరావు, నాయకులు గొంప మహేష్, వరహాలబాబు, కార్యదర్శి వీరలక్ష్మి పాల్గొన్నారు.

వీరవరంలో...

కిర్లంపూడి: మండలంలోని వీరవరం సచివాలయం-2 వద్ద గురువారం సర్పంచ్ అంబటి బుజ్జమ్మ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని అర్హులైన లబ్ధిదారులకు ప్రజాప్రతినిధులు, అధికారులు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బడే రాజేశ్వరావు, డిప్యూటీ తహసీల్దార్ మడక శ్రీనివాస్, సెక్రటరీ విజయ్ కుమార్, ఎం.గుర్రయ్య పాల్గొన్నారు.



ఎస్ఎస్‌వీ నగరంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న అధికారులు

భూ సమస్యలను పరిష్కరించాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న లిబరేషన్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు బంగార్రాజు

రౌతులపూడి: దేశ వ్యాప్తంగా గ్రామాల్లోని భూ సమస్యలను పరిష్కరించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ కేంద్ర కార్యవర్గ సభ్యుడు బుగతా బంగార్రాజు డిమాండ్ చేశారు. స్థానిక పద్మనాభ కమ్యునిటీ హాలులో గురువారం గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో హోమియో సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో భూ సంస్కరణలు తిరోగమన పద్ధతిలో జరుగుతున్నాయన్నారు. వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు. కేంద్రం విలువైన ప్రభుత్వ భూములను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించి పేదలకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో లిబరేషన్ నాయకులు సామిరెడ్డి నారాయణ మూర్తి, ఆవాల అప్పలరాజు, గుండుబిల్లి బోడియ్య, పూసల చినసత్యనారాయణ, రాజాల రత్నం, కాకర కుమారి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి వైద్య పరికరాలు అందజేత



పీహెచ్‌సీకి వైద్య పరికరాలు అందజేస్తున్న అరబిందో ఫార్మ ఫౌండేషన్ ప్రతినిధులు

తొండంగి: మండలంలోని ఏవీ నగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గురువారం అరబిందో ఫార్మా ఫౌండేషన్ రూ.1.50 లక్షల విలువైన వైద్య పరికరాలు అందజేసింది. సర్జికల్ సామగ్రి, ఇన్‌స్ట్రుమెంటల్ ట్రాలీలు, ఈఎన్‌టీ హెడ్ లైట్, ఓటోస్కోప్ లాంటి వైద్యపరికరాలను అరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధులు ఆసుపత్రికి అందించారు. ఆసుపత్రికి వైద్యపరికరాలు అందించిన అరబిందో ఫౌండేషన్ డైరెక్టర్ నిత్యానందరెడ్డి, పి.శరత్‌చంద్రారెడ్డిలకు తుని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొయ్య మురళి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ భారతి, డాక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

వీఏఏ రాజేశ్వరి సేవలు మరువలేం



రాజేశ్వరి మృతికి సంతాపంగా మౌనం పాటిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కోటనందూరు: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కేఈ చిన్నయ్యపాలెం వీఏఏ పైల రాజేశ్వరీదేవి విధినిర్వహణలో క్రమశిక్షణతో రైతులకు అందించిన సేవలు మరువలేమని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల వ్యవసాయాధికారి కేజే చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రాజేశ్వరీదేవి సంతాప సభ నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, సచివాలయ, రైతుభరోసా కేంద్రాల సిబ్బంది రాజేశ్వరీదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనారోగ్యం ఉన్నా ధైర్యంతో ముందుకు సాగి విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసేదని కొనియాడారు. రాజేశ్వరిదేవి జ్ఞాపకార్థం ఆర్బీకే సిబ్బంది సమకూర్చిన 150 గులాబీ మొక్కలను ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్, మండలాధ్యక్షుడు సుర్ల రాజు, సొసైటీ చైర్మన్ గొర్లి రామచంద్రరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ వెలగా వెంకటకృష్ణాజీ, కో ఆప్షన్ సభ్యుడు జిగటాల కోటసత్తిబాబు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు అండగా ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ జిల్లా అధికారి విజయకుమార్

కిర్లంపూడి: కౌలు రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని వ్యవసాయ శాఖ జిల్లా సంయుక్త సహాయకులు విజయ్ కుమార్ అన్నారు. మండలంలోని గోనేడలో గురువారం ఏఓ జోకా అమృత అధ్యక్షతన నిర్వహించిన కౌలు రైతుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీసీఆర్‌సీ కార్డులు పొందిన సాగుదారులకు ప్రభుత్వ పథకాలన్నీ అందేలా చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. అనంతరం గోనేడలో ప్రధాన మంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రంలో రైతులతో చర్చించారు. కార్యక్రమంలో గోనేడ సర్పంచ్ అల్లు విజయ కుమార్, తోట వెంకట సర్వారాయుడు, అల్లు శివరామకృష్ణ, యడాలి రాంబాబు, ఏడీఏ దైవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత అబ్దుల్ కలామ్



ఏలేశ్వరంలో అబ్దుల్‌కలామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంఈఓ అబ్బాయి, విద్యార్థులు

ఏలేశ్వరం: భారత మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త అబ్దుల్ కలామ్‌ను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఎంఈఓ అబ్బాయి సూచించారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద మార్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం అబ్దుల్ కలామ్ వర్ధంతిని నిర్వహించారు. సొసైటీ నిర్వాహకుడు అడపా దుర్గారావు ఆధ్వర్యంలో కలామ్ విగ్రహానికి ఎంఈఓ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రాష్ట్రపతిగా, ప్రముఖ శాస్త్రవేత్తగా కలామ్ చేసిన సేవలు మరువలేమన్నారు. యువత కలామ్ ఆశయాలను కొనసాగించాలన్నారు. విద్యార్థులు కలామ్ మార్గదర్శకాలతో ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోరాడ రాజు, దుర్గాప్రసాద్, నవీన్, అమరేశ్వరి, సత్యవేణి, రత్నకుమారి, దీపిక పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: స్థానిక మినర్వా విద్యా సంస్థల ప్రాంగణంలో గురువారం ఏపీజే అబ్దుల్ కలామ్ వర్ధంతిని నిర్వహించారు. అబ్దుల్ కలామ్ చిత్ర పటానికి మినర్వా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హరిబాబు పూలమాల వేసి నివాళులర్పించారు.

తుని నుంచి అరుణాచలానికి బస్సు సర్వీసు

తుని: తుని నుంచి అరుణాచలానికి ఈ నెల 30న బస్సు సర్వీసు నడుపుతున్నట్టు స్థానిక ఆర్టీసీ డిపో మేనేజరు ఎస్.కిరణ్‌కుమార్ గురువారం తెలిపారు. తునిలో ఈ నెల 30వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుందన్నారు. శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం మీదుగా అరుణాచలం చేరుకుంటుందన్నారు. గిర ప్రదక్షణ తర్వాత విజయవాడ మీదుగా వచ్చే నెల 2వ తేదీన తుని చేరుకుంటుందని వివరించారు. తుని పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మాదిగల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



సత్యదేవుని సన్నిధిలో మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కనకారావుకు స్వాగతం పలుకుతున్న నాయకులు

అన్నవరం: మాదిగల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకరావు మాదిగ అన్నారు. అన్నవరం రైల్వేస్టేషన్ రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు ఆయన గురువారం పూలమాలలు వేసి క్షీరాభిషేకం చేశారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో మాదిగలకు రాజకీయ పదవుల్లో సముచితస్థానం కల్పించడంపై ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తొలుత కనకరావు మాదిగ కుటుంబసభ్యులతో కలిసి సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్‌రాజా, ప్రత్తిపాడు మార్కెట్ కమిటీ డైరెక్టర్ పలివెల శ్యామల, నాయకులు పలివెల సతీష్, ఇండుగబిల్లి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు



సంజీవయ్యనగర్‌లో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న వైఎస్సార్ సీపీ నేత వీరబాబు, అధికారులు

గోకవరం: స్థానిక సంజీవయ్యనగర్‌లో పారిశుధ్యం మెరుగుకు కృషి చేస్తామని వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు అన్నారు. సంజీవయ్యనగర్‌లో డ్రైనేజీలు లేకపోవడంతో మురుగునీరు సీసీరోడ్లపై నిలిచిపోయి స్థానికులు జ్వరాల బారిన పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఆయన గురువారం ఎంపీటీసీ తోలేటి రమ్యశ్రీ, కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు, వైద్య సిబ్బంది, స్థానిక నాయకులతో కలిసి ఆ ప్రాంతంలో పర్యటించారు. వైద్య సిబ్బందితో ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య వివరాలు తెలుసుకుని సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంజీవయ్యనగర్‌లో డ్రైనేజీ సమస్యను ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తోలేటి రాంప్రసాద్, తాటికొండ సురేష్, నన్నూరి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

శ్రీప్రకాష్‌లో అట్టహాసంగా స్నాతకోత్సవం



శ్రీప్రకాష్‌లో విద్యార్థులను సత్కరిస్తున్న సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్

తుని: స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థల్లో పెద్ద బాలవనం (యూకేజీ) విద్యార్థులకు గురువారం స్నాతకోత్సవం నిర్వహించారు. తహసీల్దార్ ఎల్.శివకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అన్ని రంగాల్లో విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దడంలో శ్రీప్రకాష్ ముందుటుందన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచడానికి శ్రీప్రకాష్ అనుసరిస్తున్న విద్యా విధానాలు అభినందనీయమన్నారు. విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ తల్లిదండ్రులు ప్రతిరోజూ పిల్లలతో కొంత సమయం గడపాలన్నారు. చిన్న చిన్న కథలు, సంస్కృతి సంప్రదాయాలను తెలియజేయడం ద్వారా వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దవచ్చన్నారు. శ్రీప్రకాష్‌లో ఆటపాటలతో విద్యాబోధన జరుగుతోందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, హెచ్ఎం మాధవిసీతారత్నం, ప్రసూనమౌళి, బి.సీతారాణి, ఆఫీస్ మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు వందనం

నిజాయితీగా సేవలు



మా వలంటీర్ నానిపల్లి జాకబ్ నిజాయితీగా సేవలందిస్తున్నాడు. అతనికి కేటాయించిన 50 ఇళ్లలో ఎవరితోనూ అసభ్యంగా ప్రవర్తించడం కాని, వారి సమాచారం దుర్వినియోగం చేయడంగాని చేయ లేదు. కరోనా సమయంలో ధైర్యంగా బయటకు వచ్చి తన పరిధిలోని లబ్ధిదారులకు సేవలందించారు. అతని సహకారంతో నాకు కాపు నేస్తం, సున్నా వడ్డీ పథకాలు అందాయి. వలంటీర్ సేవలు అభినందనీయం.

– కుక్కలూరి నాగమణి, ధర్మవరం, ప్రత్తిపాడు రూరల్

కరోనా కష్టకాలంలో సైనికుల్లా సేవలు



కరోనా కష్టకాలంలో వలంటీర్లు అందించిన సేవలు వెలకట్టలేనివి. కరోనా వస్తే బంధువులు సైతం పట్టించుకోని పరిస్థితుల్లో వలంటీర్లు సైనికుల్లా ప్రాణాలకు తెలగించి సేవలందించారు. కరోనా ఒక పక్క ప్రాణాలను హరిస్తుంటే వలంటీర్లు వారి ప్రాణాలను అడ్డుపెట్టి గ్రామ సరిహద్దులో సైనికుల్లా కాపలా ఉన్నారు. గడప దాటి బయటకు వెళ్లలేని ఆ రోజుల్లో ప్రజలకు నిత్యావసర వస్తువులు అందజేసి అండగా నిలిచారు. కరోనాపై మాకు అవగాహన కల్పించి మాలో మనో ధైర్యాన్ని నింపారు.

–ఈగల గంగ, పెద్దిపాలెం, ప్రత్తిపాడు రూరల్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్
- జె.అన్నవరంలో గడపగడపకూ మన ప్రభుత్వం



జె.అన్నవరంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఏలేశ్వరం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. మండలంలోని జె.అన్నవరంలో గురువారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, అధికారులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాలుగేళ్లలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఇప్పటికే 98 శాతం అమలు చేశారన్నారు. చంద్రబాబు హయాంలో రాష్ట్రం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. సీఎం జగన్ నాయకత్వంతో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొండపల్లి వెంకటేశ్వరరావు, కాలారి సత్తిబాబు, అలమండ చలమయ్య, యిజనగిరి ప్రసాద్, గుమ్ములూరి వెంకటరమణ, నానిశెట్టి లోవరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మండలానికి చేరిన 'పాల వెల్లువ' పరికరాలు

తుని రూరల్: వచ్చే నెలలో ప్రారంభం కానున్న జగనన్న పాల వెల్లువ పథకానికి అవసరమైన యంత్ర పరికరాలు మండలానికి చేరాయని ఎంపీడీఓ పి.రవికుమార్ తెలిపారు. తుని మండలం తేటగుంట రైతు భరోసా కేంద్రానికి చేరిన పాల వెల్లుక యంత్రాలు, పరికరాల (50 కిట్లు)ను గురువారం వెటర్నరీ వైద్యుడు డాక్టర్ గోపీ, సర్పంచ్ అత్తి నాగరాజుతో కలసి ఎంపీడీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేఖవానిపాలెంలో ఏర్పాటు చేస్తున్న బల్క్ మిల్క్ సెంటర్ పనులు చివరి దశకు చేరాయన్నారు. మొదట విడతగా తుని మండలంలోని 15 పాల సేకరణ కేంద్రాలు, కోటనందూరు, రౌతులపూడి, శంఖవరం మండలాల్లో 35 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి టీవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

మణిపూర్ ప్రజలకు రక్షణ కల్పించాలి



కిర్లంపూడి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మహిళా సంఘ నేతలు

కిర్లంపూడి: మణిపూర్ ప్రజలకు రక్షణ కల్పించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శ్రామిక మహిళలు గురువారం కిర్లంపూడిలో ఆందోళన నిర్వహించారు. మణిపూర్‌లో మారణకాండకు నిరసనగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి ఏనుగువీధి సెంటర్ వరకూ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ కార్యదర్శి సీహెచ్ రత్నం మాట్లాడుతూ మణిపూర్‌లో మారణకాండ, అల్లర్లు జరుగుతున్నా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మౌనం వహించడం సరికాదన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం స్పందించి మణిపూర్ ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు. శ్రామిక మహిళలు టి.జీవ, శ్రీదేవి, వీరలక్ష్మి, బీవీ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనకు నిరసనగా ఆందోళన

ప్రత్తిపాడు: మణిపూర్ ఘటనకు నిరసనగా మండలంలోని లంపకలోవలో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ అనుబంధ సంస్థల కార్యకర్తలు గురువారం ఆందోళన చేపట్టారు. గ్రామంలోని ఎస్సీ పేటలో నిరసన ర్యాలీని లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు ప్రారంభించారు. మెయిన్‌రోడ్డు, ప్రధాన వీధుల గుండా ర్యాలీ కొనసాగింది. ఆదివాసీ మహిళలు, యువతులను నడిరోడ్డుపై ఊరేగించిన దుండగులను ఉరి తీయాలని, మణిపూర్ సీఎం గద్దెదిగాలని, ఆదివాసీ మహిళలకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఐప్వా నాయకురాలు రాజాల రత్నం, లిబరేషన్ అనుబంధ సంస్థల నాయకులు బీరా దేవతయ్య, కొమ్ము మరియమ్మ, వరలక్ష్మి, కుమారి, మార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

తుని: మానవ జీవితాన్ని అతలాకుతలం చేసే మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో హెచ్‌సీ ఎం.సూర్యనారాయణ సూచించారు. స్థానిక సీతారామపురంలో చెక్కా సూర్యనారాయణ పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో గురువారం భారత వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వలన కలిగే నష్టాలు, ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అనవసర విషయాల జోలికి పోకుండా క్రమశిక్షణతో చదివి ఉత్తమ భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో భారత వికాస్ పరిషత్ తుని శాఖ అధ్యక్షుడు పీఎల్ ఆచార్యులు, హెచ్ఎం కేఏఎస్‌వీ సూర్యనారాయణ, ఉపాధ్యాయుడు రమణ, వికాస్ పరిషత్ సభ్యులు గాజుల వేణుగోపాలస్వామి, జానకీరామ్, జోసెఫ్, గౌతమ్, రాజబాబు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దు

శంఖవరం: యువత చెడు వ్యసనాలకు బానిసలై విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని అన్నవరం ఎస్సై కిశోర్ సూచించారు. మండలంలోని కత్తిపూడి సీతారామా కళాశాలలో గురువారం వారధి కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. బాలికలు సెల్ ఫోన్లలో తెలియని వ్యక్తులతో చాటింగ్‌లు చేయరాదన్నారు. యువత గంజాయి, కొకైన్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడకూడదని, ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ వీరబాబు, అధ్యాపకులు ఎం.అక్కారావు, ఎ.వెంకటేశ్వరరావు, నెల్లిపూడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రం ప్రారంభం

కోటనందూరు: మండలంలోని కాకరాపల్లి గ్రోమోర్ ఎరువుల దుకాణం వద్ద ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాన్ని బీజేపీ నియోజకవర్గ కో కన్వీనర్ లాలం లోవరాజు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఒకే చోట నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ పరికరాలను అందించి వారి జీవితాలను మార్చడమే లక్ష్యంగా ఈ కేంద్రాలను కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. రైతులు కిసాన్ సమృద్ధి సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు డీవీఎస్ గిరి, యాదాల రమణ, బంటుపల్లి అచ్చారావు వెంకటరమణ పాల్గొన్నారు.

పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రం సందర్శన

జగ్గంపేట: మండలంలోని ఇర్రిపాకలో గల ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాన్ని బీజేపీ శ్రేణులు గురువారం సందర్శించి రైతులతో చర్చించారు. కేంద్రంలో రైతులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. బీజేపీ జగ్గంపేట నియోజకవర్గ కన్వీనర్ దాట్ల కృష్ణవర్మ, జిల్లా ఓబీసీ మోర్చ ఉపాధ్యక్షుడు వేగి భద్రం, జిల్లా కిసాన్ మోర్చ ఉపాధ్యక్షుడు బలిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

తుని: స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో శుక్రవారం చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్టు కమిషనర్ ప్రసాదరాజు గురువారం తెలిపారు. పట్టణాభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై చర్చిస్తారన్నారు. కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

విద్యుత్ ఉద్యోగుల ధర్నా

గండేపల్లి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ ఉద్యోగులు స్థానిక డివిజన్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. పీఆర్సీ అమలు చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, జూనియర్ లైన్‌మన్లకు పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.